సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



ఘనంగా పౌర్ణమి జాతర
దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం ఆశ్వీయుజ పౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. సుమారు 131 జంటలు సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

రేపు సైన్స్ సెమినార్
మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఈ నెల 19న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఫోన్ నంబర్ 9849550200లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0 /26.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

మహర్షి వాల్మీకి అందరికీ ఆదర్శం



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: రామాయణ మహాకావ్యం రూపకర్తగా, ఆదికవి మహర్షి వాల్మీకి అందరికీ ఆదర్శమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్ పూలమాల నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో రాజు ఏ విధంగా పరిపాలించాలని, కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రులు, పిల్లలు ఎలా మెదలాలి అనేది రామాయణ మహాకావ్యం ద్వారా వివరించారని తెలిపారు. తెలుగు సాహిత్యానికి వాల్మీకి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, జిల్లా అధికారులు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో డెంగీ తగ్గుముఖం



విలేకరులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

జన్నారం: జిల్లాలో డెంగీ తగ్గుముఖం పట్టిందని, మలేరియా లేదని, చికున్‌గున్యా ఒకే కేసు నమోదైందని డీఎంహెచ్‌వో హరీష్‌రాజు అన్నారు. గురువారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు పరిశీలించారు. మందుల నిల్వ వివరాలు, రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరుపై తెలుసుకున్నారు. పిల్లలకు ఇచ్చే వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యంపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ఇప్పటికే 10 సబ్ సెంటర్లు ఉండగా, మరో నాలుగు సబ్ సెంటర్లు కిష్టాపూర్, కామన్‌పల్లి, రోటిగూడ, ధర్మారానికి మంజూరైనట్లు తెలిపారు. వైద్యులు ఫైజా, డీఎస్‌వో వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది గంగదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ముగిసిన పోలీస్ స్పోర్ట్స్ మీట్



ట్రోఫీ అందజేస్తున్న కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో పోలీస్ అధికారులకు నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా పోలీస్ బ్యాండ్‌తోపాటు పోలీస్ క్రీడాకారుల కవాతు ద్వారా కమాండెంట్ వెంకటరాములు గౌరవ వందనం స్వీకరించారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వ్యక్తిగత, జట్లకు ట్రోఫీలు అందజేశారు. నేటి యాంత్రిక జీవనంలో క్రీడల ఆవశ్యకత చాలా ఉందని అన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, కాళిదాసు, ఆర్‌ఐలు, ఏఆర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పులుల రాకపై అధ్యయనం



మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం ముఖద్వారం వద్ద అటవీ అధికారులు

- ‘తిప్పేశ్వర్’ సందర్శిన అటవీ అధికారులు
- క్షేత్రస్థాయి పరిశీలనకు పర్యటన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కవ్వాల్ అభయారణ్యంలోకి పులుల రాక, సఫారికి వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు, స్థానికులకు ఉపాధి కల్పన తదితర అంశాలపై జిల్లా అటవీ అధికారులు అధ్యయనం చేస్తున్నారు. జిల్లా అడవులను ఎకో టూరిజంగా తీ ర్చిదిద్దే క్రమంలో అటవీశాఖ అధికారులు మహా రాష్ట్రలోని యావత్మాల్ జిల్లా తిప్పేశ్వర్ పులుల అభయారణ్యంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పలు విషయాలు తెలుసుకుంటున్నారు. జిల్లా అటవీ అధి కారి శివ్ ఆశిష్‌సింగ్ అక్కడి పరిస్థితులను తెలుసుకునేందుకు ఇక్కడి సిబ్బందిని స్వయంగా క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు మహారాష్ట్రలోని అక్కడి అధికారులు తీసుకుంటున్న చర్యలు, వనరుల వినియోగం, పర్యాటకులకు కల్పించే వసతులు, స్థానిక గిరిజనుల భాగస్వామ్యం వంటి కీలక అంశాలపై పరిశీలన చేసేలా వీలు కల్పించారు. మొదట మంచిర్యాల డివిజన్ పరిధిలో ఎఫ్‌డీవో సర్వేశ్వర్, మంచిర్యాల, లక్సెట్టిపేట ఎఫ్‌ఆర్వోలు రత్నాకర్‌రావు, సుభాష్, డీఆర్వోలు, సెక్షన్, బీట్‌ఆఫీసర్లతో మొత్తం తొమ్మిది మంది బృందం అక్కడ సఫారి చేస్తూ, అభయారణ్యంలో తీసుకుంటున్న చర్యలపై ఒక రోజుపాటు అక్కడి పరిస్థితులను గమనించారు. అంతేకాక తిప్పేశ్వర్ అభయారణ్యం అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తున్న బయాలజిస్టు డాక్టర్ రాంజాన్ విరానితో టైగర్ రిజర్వులో చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పులులు

తిప్పేశ్వర్ అభయారణ్యం 148.63చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. ఉమ్మడి జిల్లాలో విస్తరించిన కవ్వాల్ టైగర్ రిజర్వు కోర్ ఏరియానే 893 చ.కి.మీ విస్తీర్ణంలో ఉంది. అక్కడ పులులు పదుల సంఖ్యలో ఉన్నప్పటికీ ఇక్కడ ఒక్క పులి కూడా స్థిర నివాసం ఏర్పర్చుకోలేదు. 2015లో కవ్వాల్ టైగరు రిజర్వుగా కేంద్రం ఏర్పాటు చేసింది. అయితే అంతకుముందు నుంచే ఇక్కడికి అనేక పులులు వలస వస్తున్నాయి. కానీ కొన్ని రోజులకే తిరిగి వెళ్లిపోతున్నాయి. ఇటీవల కూడా ఓ పులి సంచారం గుర్తించారు. అయితే ఆ పులి స్థిరంగా ఉంటుందా? లేదా? అనేది చెప్పలేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో తిప్పేశ్వర్, తడోబా నుంచి వలస వచ్చే పులులకు కవ్వాల్‌ను ఆవాసాలుగా తీర్చిదిద్దేందుకు గత కొన్నేళ్లుగా అధికారులు అనేక చర్యలు చేపట్టారు. అడవిలో గడ్డిక్షేత్రాలు పెంచడం, మానవ, పెంపుడు జంతువుల రాకపోకల నిలుపుదల, నీటి సౌకర్యం, శాకాహార జంతువుల పెంపు, తదితర వాటిపై దృష్టి సారించారు. అయితే ఈ చర్యలు ఇప్పటికిప్పుడు ఫలితం కనిపించకపోయినా, భవిష్యత్‌లో తప్పకుండా సత్ఫలితాలు ఇస్తాయని అటవీ అధికారులు నమ్ముతున్నారు. మహారాష్ట్రలో ఇరుకు ఆవాసాలు కావడంతో పులులు కచ్చితంగా కవ్వాల్‌లో ఆవాసం కోసం వస్తాయని అధికారుల నమ్మకం. ఈ క్రమంలో అక్కడి టైగర్ రిజర్వులో చేపడుతున్న చర్యలు తెలుసుకుంటూ ఇక్కడ అమలు చేసేందుకు అధికారులతో క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టారు. ముఖ్యంగా అడవుల్లో మానవ సంచారం లేకపోవడం, జంతువులకు నిరంతరం నీటి లభ్యత, గడ్డి క్షేత్రాల పెంపు, స్థానికుల భాగస్వామ్యం, వనరుల వినియోగం వంటి కార్యక్రమాలు అక్కడ పులులు, వన్యప్రాణుల సంరక్షణకు కలిసి వస్తోందని పర్యటనకు వెళ్లిన అధికారులు ‘సాక్షి’తో వెల్లడించారు.

ఏఈవోలపై చర్యలకు సిద్ధం

- డిజిటల్ సర్వే నిర్లక్ష్యంపై చర్యలు
- వేతనాల నిలిపివేత, అవుట్ సోర్సింగ్ తొలగింపునకు హెచ్చరిక
- సహాయకులు కావాలంటున్న ఏఈవోలు



డీఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈవోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: డిజిటల్ సర్వే చేపట్టని ఏఈవోలపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. డిజిటల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు, రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల నిలిపివేత చర్యలు చేపట్టనుంది. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను గురువారం హాజీపూర్ మండల రైతు వేదికలో జరిగిన వ్యవసాయ అధికారుల సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఏఈవోలకు తెలియజేశారు. దీంతో కక్షపూరితంగా వ్యవహరిస్తే నిరసనలు, దీర్ఘకాలిక సెలవుతో సమ్మె చేపడుతామని ఏఈవోలు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంటల డిజిటల్ సర్వేకు గత నెల 25న ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కో ఏఈవో 6వేల నుంచి 13వేల ఎకరాల వరకు సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. ఇది ఒక్కరితో సాధ్యం కాదని, సహాయకులను నియమించాలని కోరుతూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోకుండా ఇతర విధుల్లో పాల్గొంటున్నారు. చర్యల్లో భాగంగా ఈ నెల నుంచి ఏఈవోల వేతన బిల్లులు ప్రత్యేకంగా పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏఈవోలు ఆందోళన చెందుతున్నారు. చాలీచాలని జీతాలతో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్నామని, నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని, తొలగిస్తామంటూ హెచ్చరించడం సరికాదని బెల్లంపల్లి క్లస్టర్ ఏఈవో టి.అంజలి తెలిపారు. ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని సహాయకులను నియమిస్తే సర్వే చేపడతామని కోటపల్లి ఏఈవో రాజ్‌కుమార్ తెలిపారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో జిల్లాలో క్యాంటీన్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు సెప్టెంబర్ 19 నుంచి 28 వరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ హైదరాబాద్‌లో అందించిన శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గురువారం కలెక్టరేట్‌లో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, డెయిరీ ఫార్మ్, కోళ్ల, చేపల పెంపకం, మీ సేవతోపాటు వివిధ యూనిట్ల స్థాపనకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. యూనిట్లను ఎంపిక చేసుకున్న లక్సెట్టిపేటకు చెందిన జమున, హాజీపూర్‌కు చెందిన జ్యోతి, గుడిపేటకు చెందిన ధనలక్ష్మిలకు ధ్రువపత్రాలు అందజేసినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ పాల్గొన్నారు.

చట్టవ్యతిరేకులపై ఉక్కుపాదం

- ఈ ఏడాదిలో 1,477 మంది బైండోవర్
- 27 కేసులు.. 82మంది అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ ఎగ్గడి భాస్కర్

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాలక్రైం: జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన అలజడులు, గ్యాంగ్ దాడుల తీరుపై వివరించారు. ఈ నెల17న ‘సాక్షి’ దినపత్రికలో ‘ఆగడాలకు అడ్డేది’ శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించారు. జిల్లా కేంద్రంలో గత ఏడాది సెప్టెంబర్ 29 నుంచి గ్యాంగ్ దాడులు ప్రారంభమయ్యాయని, ఉనికిని చాటుకునేందుకు రెండు వర్గాల మధ్య గ్యాంగ్ వార్ నడుస్తోందని తెలిపారు. ఒక వర్గానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడి వద్ద పని చేస్తున్న మేర సంజీవ్, మరో వర్గానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకుడు గడప రాకేష్ నాయకత్వం వహిస్తూ వ్యక్తిగత గొడవల కారణంగా వరుస దాడులు చేసుకున్నారని తెలిపారు. ఈ కేసుల్లో ఇరువర్గాలకు చెందిన వారిపై 27 కేసులు నమోదు చేసి 82 మందిని అరెస్ట్ చేశామన్నారు. మరో 65మందిపై ప్రత్యేక నిఘా ఉంచుతూ సస్పెక్ట్ షీట్ నమోదు చేశామని తెలిపారు. ఈ ఏడాదిలో 1,477 మందిని బైండోవర్ చేశామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారు ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఏసీపీ ఆర్.ప్రకాష్, రూరల్ సీఐ ఆకుల అశోక్‌కుమార్, ఎస్సైలు సనత్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.


బొగ్గు రవాణా వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్: బొగ్గు రవాణా వేగవంతం చేయాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. ఓపెన్ కాస్ట్ వ్యూ పాయింట్ నుంచి క్వారీ పని ప్రదేశాలు, కోల్ బెంచీలను పరిశీలించారు. అనంతరం ఆయన ఏరియా అధికారులతో మాట్లాడుతూ స్టాక్ కోల్‌ను వీలైనంత త్వరగా వినియోగదారులకు రవాణా చేయాల్సి ఉందన్నారు. నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో యంత్రాలు, సామగ్రి సమకూర్చుకోవాలని, కాంట్రాక్టర్లు నిర్ణీత లక్ష్యాల మేరకు ఓబీ తీయాలని, దీనిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓ టు జీఎం ఎన్.సత్యనారాయణ, ప్రాజెక్ట్ అధికారులు టీ.శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎంలు చిరంజీవులు(ఐఈడీ), అరవిందరావు (పర్సనల్), ఎస్టేట్ మేనేజర్ వరలక్ష్మి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ బ్రహ్మాజీ, ఏరియా క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల తిప్పలు తప్పేనా..?



తాండూర్ మండలంలోని జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి వాహనాల బారులు(ఫైల్)

- గత ఏడాది తరచూ కొనుగోళ్లు బంద్
- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నిరీక్షణ
- సీసీఐ తీరుతో ప్రైవేట్‌కు మొగ్గు

మంచిర్యాలఅగ్రికల్చర్: వచ్చే నెల నుంచి పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. మరోవైపు గత ఏడాది ఎదురైన కష్టాలు ఈసారైనా తప్పుతాయా లేదా అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. పంట పండించడం ఒక ఎత్తయితే.. దిగుబడి వచ్చిన పంటను విక్రయించడానికి రాత్రింబవళ్లు జిన్నింగ్ మిల్లుల వద్ద రైతులు అరిగోస పడుతున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది 1.50లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా.. సుమారు 16లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కిలోమీటర్ల మేర లైన్లు..

గత ఏడాది జిన్నింగ్‌మిల్లుల వద్ద కిలోమీటర్ల మేర పత్తి వాహనాలు నిలిచిపోవడంతో రైతులు ఆందోళనలు, ధర్నాలతో రోడ్డెక్కారు. జిల్లాలో సీసీఐ ఏర్పాటు చేసిన జిన్నింగ్ మిల్లుల్లోని కొనుగోలు కేంద్రాల్లో తరచూ పత్తి సేకరణ నిలిపివేశారు. నాణ్యత లేదని, జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు పేరుకుపోయాయని, వాతావరణం కారణంగా నాలుగు రోజులు సేకరిస్తే వారం రోజులు నిలిపివేశారు. దీంతో ధర తక్కువైనా దళారులను ఆశ్రయించి విక్రయించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుందని నిల్వ చేసుకుని ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురైంది. గత అనుభవాల దృష్ట్యా అధికారులు ముందస్తు చర్యలు చేపడితే మేలు జరుగుతుంది.

సీసీఐ తీరుతో ప్రైవేటుకు..

ప్రైవేటు వ్యాపారులకు మేలు చేసేలా సీసీఐ వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది క్వింటాల్‌కు రూ.7,020 ప్రభుత్వ మద్దతు ధర ఉండగా.. పింజ పొడవు, మైక్‌వాల్యూ తక్కువ వస్తుందని రూ.6,700 నుంచి రూ.6,900 ధరతో కొనుగోలు చేసింది. జిన్నింగ్ మిల్లుల్లోనే సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో రైతులకు సౌకర్యాలు కరువయ్యాయి. రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. గత ఏడాది జిల్లాలో 1.55 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కాగా, 12 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. సీసీఐ చెన్నూర్ మార్కెట్ యార్డు పరిధిలో 3, బెల్లంపల్లి పరిధిలో 2, లక్సెట్టిపేట పరిధిలో 1 జిన్నింగ్‌మిల్లులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి సేకరించారు. సీసీఐ 4,22,680 క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారులు 2,70,965 క్వింటాళ్లు, చెక్‌పోస్టుల ద్వారా 40,750 క్వింటాళ్లు మొత్తం 7,34,395 క్వింటాళ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. మరో 3 లక్షల క్వింటాళ్ల వరకు పెద్దపల్లి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వైపు విక్రయాలకు తరలించారు.

జాప్యం.. దళారులకు మేలు..

నవంబర్ నెలాఖరు వరకు పత్తి పంట చేతికొస్తుంది. ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో మిల్లుల్లో కొనుగోలు చేసిన పత్తితోపాటు ఎగుమతి చేసేందుకు పత్తి బేళ్ల నిల్వలు పేరుకుపోతున్నాయని సీసీఐ కొనుగోలు నిలిపి వేస్తుంది. ఇది దళారులకు కలిసి వస్తుంది. గ్రామాల్లో తిష్ట వేస్తూ రైతుల ఇళ్ల వద్దనే తూకం వేయడం, వెంటనే డబ్బుల చెల్లింపు అంటూ క్వింటాల్‌కు రూ.6వేల నుంచి రూ.6,300 లెక్కన తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. క్యాష్ కటింగ్ అంటూ క్వింటాల్‌కు రూ.150 కోత, తూకంలో మోసాలతో క్వింటాల్‌కు రూ.700 నుంచి రూ.వెయ్యి వరకు రైతులు నష్టపోయారు. ఈ ఏడాదైనా జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్నాం..

జిల్లాలో పత్తి సేకరణకు జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాట్లను పరిశీలించి, తూకం, వేబ్రిడ్జి తదితర ఏర్పాట్లు, రైతులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. వచ్చే నెల నుంచి పత్తి సేకరణ ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నాం.

– శాబొద్దీన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

భీం స్ఫూర్తితోనే తెలంగాణ

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- జోడేఘాట్‌లో ఘనంగా కుమురంభీం వర్ధంతి
- నివాళులర్పించిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు
- తరలివచ్చిన ఆదివాసీలు



భీం సమాధి వద్ద పూజలు చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్, పీవో, ఎమ్మెల్యేలు



కుమురంభీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్/కెరమెరి: రాజ్యాధికారం కోసం కుమురంభీం సాగించిన పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని రాష్ట్ర పంచాయతీరాజ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో గురువారం కుమురంభీం 84వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ దండె విఠల్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్, సిర్పూర్, మంచిర్యాల, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు, రామగుండం సీపీ శ్రీనివాస్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, మాజీ ఎంపీ వేణుగోపాలచారి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావుతో కలిసి నివాళులర్పించారు. సమాధి వద్ద పూలు చల్లి పూజలు చేశారు. ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు భీం విగ్రహానికి పూలమాలలు వేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది. భీం మనుమడు సోనేరావు, వారసులకు అధికారులు సంప్రదాయ దుస్తులు అందజేశారు.

స్వయం పాలన కోసమే పోరాటాలు..

అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం, కుమురంభీం పోరాటంతోనే ఐదో షెడ్యూల్, 1/70, ఐటీడీఏ, పెసా, తదితర చట్టాలు అమల్లోకి వచ్చాయన్నారు. ఇప్పటివరకు సాగిన పోరాటలన్నీ స్వయం పాలన కోసమేనని స్పష్టం చేశారు. నీరు, నిధులు, నియామకాల కోసం చేపట్టిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి భీం పోరాటమే స్ఫూర్తి అని స్పష్టం చేశారు. ఐటీడీఏలు ప్రత్యేక నిధులు లేక నిర్వీర్యం అయ్యాయని పేర్కొన్నారు. నిధుల మంజూరు విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనివార్య కారణాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోడేఘాట్‌కు రాలేదని, త్వరలో వస్తారని తెలిపారు. జోడేఘాట్‌లో టూరిజం డెవలప్‌మెంట్ కోసం రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జోడేఘాట్ ప్రాంతంలో భూముల ఆక్రమణకు గురికాకుండా కలెక్టర్, పీవో చర్యలు తీసుకోవాలని సూచించారు. 12 పోరు గ్రామాల్లో ప్రజలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసీ మహిళలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ జోడేఘాట్ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో పనిచేయడం గర్వంగా ఉందని అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అటవీ అనుమతుల మంజూరుకు కృషి : ఎంపీ

ఉమ్మడి జిల్లాలో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీ అనుమతులు మంజూరుకు కృషి చేస్తామని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జైనూర్‌లో జరిగిన ఘర్షణల్లో ఆదివాసీలపై నమోదైన కేసులు ఎత్తివేయాలన్నారు. అనంతరం మంత్రి సీతక్క జోడేఘాట్‌లో రూ. 2.75 కోట్లతో నిర్మించే ప్రధానమంత్రి జన్‌మన్ వసతి గృహం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్, భీం మనవడు సోనేరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, గిరిజన సంఘాల నాయకులు మోతీరాం, మడావి గుణవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా సూరు వర్ధంతి

కెరమెరి(ఆసిఫాబాద్): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక సాగిన పోరాటంలో కుమురంభీంకు తోడుగా నిలిచిన కొలాం వీరుడు కుమురం సూరు 27వ వర్ధంతి గురువారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి సీతక్క సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, వెడ్మ బొజ్జు, కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, మాజీ ఎంపీ వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, భీం మనుమడు సోనేరావు, మాజీ జెడ్పీటీసీ దుర్పతబాయి, అరుణ విగ్రహానికి నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం వర్ధంతి నేపథ్యంలో మండలంలో జోడేఘాట్‌లో గురువారం భీం వారసులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పాత జెండాలు తీసి, కొత్త జెండాలకు రంగులు పూసి ఎగురవేశారు. భీం మనుమడు సోనేరావు, ఆయన కుటుంబ సభ్యులు, ఆదివాసీలు, అధికారులు పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అతిథులకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం తలపాగా చుట్టారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు రాజేష్ కార్వా(ఫైల్)

బెల్లంపల్లి: సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లికి చెందిన వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో నివాసం ఉంటున్న విజయ్ ఆటోస్టోర్ యజమాని ఓంప్రకాష్ కార్వా కుమారుడు రాజేష్ కార్వా వ్యాపార లావాదేవీల నిమిత్తం బుధవారం కారులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. గురువారం తెల్లవారుజామున గజ్వేల్ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్క్రాప్ దుకాణాన్ని ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయలైన రాజేష్ కార్వా(40) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

స్వగ్రామానికి మృతదేహం

జన్నారం: ఉపాధి కోసం ఇరాక్ దేశం వెళ్లిన వ్యక్తి శవమై ఇంటికి చేరాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి రాయమల్లు(30) కొన్ని నెలల క్రితం ఉపాధి కోసం ఇరాక్ దేశం వెళ్లి రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆగస్టు 21న మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఇరాక్‌లోని బత్తుల ఎల్లస్వామి, చింతగూడకు చెందిన పలువురు యువకులు ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరింది.

మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం బాటిళ్లు

కోటపల్లి: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని కోటపల్లి పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్రలో ఎన్నికల నేపథ్యంలో పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. బొలేరో ట్రాలీ, ఆటోలో మద్యం తరలిస్తుండగా ఎదులబంధం గ్రామ సమీపంలో పట్టుకున్నామని ఎస్సై రాజేందర్ తెలిపారు. మద్యం విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం


బండి స్వప్న (ఫైల్)

భీమారం: మండల కేంద్రానికి చెందిన వివాహిత బండి స్వప్న అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీ.రాములు తెలిపారు. పద్మశాలి వీధిలోని బండి రాజు భార్య స్వప్న బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు. వారం రోజులుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం రైల్వే విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. సికింద్రాబాద్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో వచ్చి బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో దిగారు. బుకింగ్ కార్యాలయంలో టిక్కెట్ల క్రయ విక్రయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తాత్కాల్ టిక్కెట్ల రిజర్వేషన్‌లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లడంతో విచారించి వాస్తవాలను నిర్ధారించుకున్నట్లు తెలుస్తోంది. రైల్వేస్టేషన్ ఆవరణలో పలు విభాగాల్లోకి వెళ్లి రికార్డులు పరిశీలించారు.

గనిలోకి దిగాల్సిందే..!

- ఐదేళ్ల నిబంధనకు కసరత్తు
- భూగర్భంలో పనికి మొండికేస్తున్న యువ కార్మికులు
- కొన్ని డిజిగ్నేషన్లకు దూరం
- సర్ఫేస్ కోసమే ప్రయత్నాలు
- కొత్త నిబంధనలతో పైరవీలకు చెక్


విజయకేతనం చూపిస్తున్న యువ కార్మికులు(ఫైల్)

శ్రీరాంపూర్: సింగరేణిలో కారుణ్య ఉద్యోగాల పుణ్యమాని యువ కార్మికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కానీ భూగర్భంలో దిగి పని చేయడానికి వెనుకంజ వేస్తుండడం యాజమాన్యానికి సమస్యగా మారింది. గతంతో పోల్చితే తేలికపాటి పనులే లోపల ఉన్నా పని చేయడానికి యువ కార్మికులు మొండికేస్తున్నారు. సర్ఫేస్‌లోనే పనులు కావాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. భూగర్భంలో యాక్టింగ్‌లకు వెళ్లడానికి ఇష్టపడడం లేదు. చివరికి యాక్టింగ్‌లకు చేసిన పర్మినెంట్ లెటర్లు తీసుకోవడం లేదు. దీంతో భూగర్భంలోని కొన్ని డిజిగ్నేషన్లు ఖాళీగా ఉంటున్నాయి. కొందరైతే బదిలీ వర్కర్ నుంచి జనరల్‌మజ్దూర్ అయిన మరుసటి రోజే రాజకీయ పైరవీలు చేయిస్తూ తమను సర్ఫేస్‌లో లైట్ జాబ్ ఇప్పించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ విపరీత పోకడతో అధికారులు తల పట్టుకుంటున్నారు. ఒకప్పుడు యూనియన్ నేతల పైరవీలు ఉంటే రానురాను ఎమ్మెల్యేలు మొదలుకొని మంత్రుల దాకా పైరవీలు రావడంతో ఉన్నత అధికారులు చేసేదేమీ లేక ఊ కొడుతున్నారు. దీంతో భూగర్భంలో సరిపడా కార్మికులు కరువై బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడుతోంది. ఈ సంస్కృతికి చెక్ పెట్టాలని యాజమాన్యం నిర్ణయించింది.

భూగర్భంలో ఐదేళ్ల నిబంధన..

కంపెనీలో ఉన్న ఈ వింతపోకడకు చెక్ పెట్టాలని సీఎండీ బలరాంనాయక్ నిశ్చయించుకున్నారు. ఇకపై కంపెనీలో డిపెండెంట్ కింద ఎవరు చేరినా మొదటి ఐదేళ్లు తప్పనిసరిగా భూగర్భంలోకి దిగి పని చేసేలా కొత్త నిబంధనలు తయారు చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇదివరకు ఈ తరహా నిబంధనలు ఉన్నా మెడికల్ రిపోర్టులు, పైరవీలు, సంఘాల పేరు చెప్పుకొని అండర్ గ్రౌండ్ నుంచి వచ్చి సర్ఫేస్‌లో తిష్ట వేస్తున్నారు. దీంతో లోపల దిగి పనిచేసే వారు కరువయ్యారు. ఇకముందు అలా జరుగుండా కఠిన నిబంధనలు తీసుకొస్తున్నారు. విధివిధానాలు తయారు చేయాల్సి ఉంది. సర్ఫేస్‌లో ఖాళీలు ఉంటే ఆ డిజిగ్నేషన్లకు రావడానికి ఇక కనీస అర్హత అండర్‌గ్రౌండ్‌లో ఐదేళ్ల పని చేయాలనే నిబంధన తప్పని సరిచేసే అవకాశం ఉందని తెలిసింది.

చాలా డిజిగ్నేషన్లలో ఖాళీలు..

కొత్తగా డిపెండెంట్‌గా ఉద్యోగంలో చేరిన వారికి బదిలీ వర్కర్ డిజిగ్నేషన్ ఇస్తారు. సంవత్సరంలో భూగర్భంలో 190, సర్ఫేస్‌లో 240 మస్టర్లు చేస్తే వారికి జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ ఇచ్చి పర్మినెంట్ చేస్తారు. ఇలా అండర్‌గ్రౌండ్‌లో జనరల్ మజ్దూరైన వారిని ఏ డిజిగ్నేషన్‌కు పంపి పనిచేయాలన్నా చేయాలి. కానీ కోల్‌కట్టర్, లైన్‌మెన్, సపోర్టుమెన్ విధులకు వెళ్లడం లేదు. ఈ పనులు కాస్త శ్రమతో కూడుకున్నది కావడంతో వెనుకడుగు వేస్తున్నారు. ఇంతకు క్రితం అండర్‌గ్రౌండ్‌లో పని చేసే వారు సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా రావాలంటే తప్పనిసరిగా అండర్‌గ్రౌండ్‌లో జనరల్ మజ్దూర్ అయ్యి ఉండాలనే నిబంధన ఉండేది. దీంతో ఇతర డిజిగ్నేషన్లకు ఎవరు వెళ్లడం లేదనే ఉద్దేశంతో అన్ని డిజిగ్నేషన్ల వారికి కూడా సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌కు అవకాశం కల్పించి కంపెనీ ఇటీవలే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. అయినా ఇంకా కొన్ని డిజిగ్నేషన్లకు మొగ్గు చూపకుండా ఎంతసేపు సర్ఫేస్‌లో పనిచేయాలనే మక్కువ యువ కార్మికుల్లో పెరిగింది. దీనికి నేడు కంపెనీ చెక్ పెడుతూ ఎవరైనా సరే తప్పనిసరిగా ఐదేళ్లు భూగర్భంలో పని చేయాలని నిబంధన పెట్టబోతున్నారు. అప్పుడే మిగతా సర్ఫేస్‌లో రావాలన్నా, ఇతర సౌకర్యాలు పొందుతారనే మెలిక పెట్టే అవకాశం ఉందని తెలిసింది. అప్పుడే పైరవీలు పోయి భూగర్భ గనుల్లో ఆశించిన బొగ్గు ఉత్పత్తిని సాధించవచ్చనే అభిప్రాయంతో యాజమాన్యంలో వ్యక్తమవుతోంది.

పెరుగుతున్న గైర్హాజరు..

యువ కార్మికులు సర్ఫేస్‌లో పని ఇవ్వకుంటే గైర్హాజరైనా అవుతున్నారూ తప్ప లోపలికి దిగి పని చేయడం లేదు. సంవత్సరం వంద మస్టర్లు కూడా నిండని వారిలో యువ కార్మికులే 25శాతం ఉన్నారని కంపెనీ లెక్కలు చెబుతున్నాయి. డిగ్రీలు, బీటెక్, ఎంటెక్ వంటి ఉన్నత చదువులు చదివిన వారు తమ విద్యార్హతకు తగ్గ ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది సాధ్యం కాదని ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ ద్వారా వచ్చే నోటిఫికేషన్లను సద్వినియోగం చేసుకొనే వారి విద్యార్హతకు తగ్గ పోస్టులను సాధించడం ఒక్కటే మార్గమని అధికారులు పేర్కొంటున్నారు. దీనికి తోడు మహిళా కార్మికులను కూడా భూగర్భంలో దించే ఆలోచన కంపెనీ చేస్తున్నట్లు తెలిసింది.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు


బస్సు వద్ద ప్రయాణికులు


ముక్కలైన టైరు

- డ్రైవర్ అప్రమత్తతో వంద మందికి తప్పిన ప్రాణాపాయం

కడెం: మంచిర్యాల నుంచి నిర్మల్‌కు గురువారం ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీబస్సు టైరు కడెం మండలం పెద్దూర్ డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలో పేలింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో వంద మందికి ప్రాణాపాయం తప్పింది. మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి నిర్మల్‌కు బయల్దేరింది. పెద్దూరు వద్దకు వస్తున్న సమయంలో బస్సులో 98 ప్రయాణికులు ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో టైరు పేలింది. దీంతో బస్సు ఒక్కసారిగా కుదుపునకు లోనైంది. బస్సులోని ప్రయాణికులు భయాందోళనతో అరిచారు. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును కంట్రోల్ చేసి.. రోడ్డు పక్కన నిలిపివేశాడు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఓవర్‌లోడ్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం రద్దు చేయాలని పలువురు డిమాండ్ చేశారు.

కల్వర్టు వద్ద మగ శిశువు మృతదేహం


కల్వర్టు నీటిలో మగ శిశువు మృతదేహం

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద గురువారం 7 నుంచి 8 నెలల మగశిశువు మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన పశువుల కాపరులు పశువులకు నీరు తాగించేందుకు తీసుకెళ్లగా మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే గ్రామస్తులకు తెలిపారు. గ్రామ పెద్దలు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని మృత శిశువును బయటకు తీయించారు. శిశువు వయసు 7 నుంచి 8 నెలలు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. సమీప ఆస్పత్రుల్లో సంప్రదించి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు.. ఆస్పత్రిలో మృతి


ఘటనాస్థలిలో గాయాలతో రాంటెంకి శంకర్

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని గూడెం, చిత్తాం గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడెంకు చెందిన రాంటెంకి శంకర్(45) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్, రాజేశ్వరి దంపతుల పెద్ద కుమారుడు యశ్వంత్ మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. హాస్టల్‌కు వెళ్లేందుకు గురువారం యశ్వంత్‌తోపాటు అతడి తల్లి రాజేశ్వరి బస్సులో బయలుదేరారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆధార్ కార్డు మరిచిపోయినట్లు గుర్తించిన రాజేశ్వరి భర్త శంకర్‌కు ఫోన్ చేసింది. శంకర్ ద్విచక్ర వాహనంపై ఆధార్ కార్డు అందించేందుకు వెళ్తుండగా చిత్తాం సమీపంలో గుంతల కారణంగా బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. మరో బస్సులో వెళ్తున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడి చేరుకున్నారు. చికిత్స కోసం మహారాష్ట్రలోని అహేరికి తరలించారు. తలకు, ఇతర భాగాలకు గాయాలు కావడంతో అక్కడి వైద్యులు పెద్ద ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అహేరి నుంచి కాగజ్‌నగర్‌కు తీసుకువచ్చి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో శంకర్ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారులు యశ్వంత్, నిర్వాన్, కుమార్తె అనురాధ ఉన్నారు.

సకాలంలో వైద్యం అందక..

భారీ వాహనాల రాకపోకలతో చింతలమానెపల్లి మండలం ఖర్జెల్లి వరకు రహదారి అధ్వానంగా మారింది. 20కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి సుమారు గంటన్నరకు పైగా సమయం పడుతోంది. గూడెం, శివపెల్లి, చిత్తాం, బూరుగూడ, కోయపెల్లి, దిందా, కేతిని గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నారు. మరోవైపు చింతలమానెపల్లి మండలానికి 108 వాహనం లేదు. రవీంద్రనగర్ పీహెచ్‌సీలో వైద్యుడి పోస్ట్ ఖాళీగా ఉంది. శంకర్‌కు సకాలంలో వైద్యం అందితే ప్రాణాలు దక్కేవని కుటుంబ సభ్యులు విలపించారు.

బాధ్యతలు స్వీకరించిన ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జీ వీసీ


ఇన్‌చార్జీ వీసీని సత్కరిస్తున్న ఉద్యోగులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జీ వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని ట్రిపుల్‌ఐటీ క్యాంప్ ఆఫీసులో మాజీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ క్యాంప్ ఆఫీసుకు వచ్చిన ప్రొఫెసర్ గోవర్ధన్‌కు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ట్రిపుల్‌ఐటీ ఉద్యోగులు భాస్కర్‌రెడ్డి, హరికృష్ణ పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

భీమిని: మండలంలోని కేస్లాపూర్-వడాల గ్రామాల మధ్య గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. చిన్నగుడిపేట గ్రామానికి చెందిన వీసు అంజి కేస్లాపూర్ వైపు వెళ్తుండగా.. రాజారాం నుంచి కేస్లాపూర్‌కు ఎదురుగా వస్తున్న దుర్గం క్రిష్ణ మోటార్‌సైకిల్ ఢీకొన్నాయి. ఇద్దరూ కిందపడగా తీవ్ర గాయలయ్యాయి. 108లో బెల్లంపల్లికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పాఠశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థి?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 5వ తరగతి విద్యార్థి గురువారం రాత్రి స్వల్పంగా గాయపడ్డాడు. దసరా సెలవుల తర్వాత తల్లిదండ్రులు పాఠశాలకు తీసుకు రాగా.. తన స్నేహితులు రాలేదని, తనను ఎందుకు తీసుకొచ్చారని ఏడుస్తూ మొదటి అంతస్తు పై నుంచి దూకినట్లు ప్రచారం జరుగుతోంది. స్వల్పంగా గాయపడిన అతడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఇంటికి వస్తానని మెట్లు దిగుతున్న క్రమంలో జారి పడడంతో కాలు బెణికిందని తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా స్పందించలేదు.

ఫెన్సింగ్ జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలబాలికల ఫెన్సింగ్ జట్ల ఎంపిక పోటీలు శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఫెడరేషన్ సెక్రెటరీ ఫణిరాజా, అసోసియేషన్ వ్యవస్థాపకులు రమేశ్ ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఫెడరేషన్‌కు చెందిన బాబురావు, అసోసియేషన్ సభ్యులు ఆవునూరి మహేశ్, చెరుకు అనిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో పంచాయతీ ఈవో హల్‌చల్


గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో

బాసర: బాసర మేజర్ గ్రామపంచాయతీ ఈవో గోవిందరాజు గురువారం మద్యం మత్తులు వీరంగం సృష్టించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈవో నిత్యం నిజామాబాద్ నుంచి విధులకు వచ్చి వెళ్తున్నాడు. గురువారం ఉదయమే మద్యం తాగి కారు నడుపుతూ బాసరకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా వాకింగ్ చేస్తున్న వారిలో విజయరామారావును ఢీకొట్టాడు. అక్కడ ఆగకుండా.. నేరుగా పంచాయతీ కార్యాలయం ఎదుట కారు పార్కింగ్ చేశాడు. తర్వాత కార్యాలయంలోకి వెళ్లి తన సీటుపై పడుకున్నాడు. గాయపడిన విజయరామారావు ఈవోపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని ఈవోను విచారణ చేశారు. మద్యం మత్తులో తడబడుతూ మాట్లాడాడు. తర్వాత కారును తనిఖీ చేయగా అందులో మద్యం బాటిల్ దొరికింది. దీంతో గోవిందరాజుపై కేసు నమోదు చేశారు. సాయంత్రం మత్తు దిగడంతో నిజామాబాద్‌కు వెళ్లిపోయాడు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఒకరి ఆత్మహత్య


గుడ్ల గంగయ్య మృతదేహం

భైంసారూరల్: మండలంలోని పేండ్‌పెల్లి గ్రామానికి చెందిన గడ్ల గంగయ్య(40) మద్యానికి కుటుంబ సభ్యులు డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... గడ్ల గంగయ్య కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. బుధవారం మద్యానికి డబ్బులు కావాలని కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. వారు డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి గ్రామ శివారులోని పశువుల కొట్టం వద్ద పురుగుల మందు క్రిమిసంహారకమందు తాగాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు వెంటనే అక్కడకు వెళ్లి.. చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. గంగయ్యకు భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మానలేకపోతున్నానని యువకుడు..


బొలిశెట్టి శ్రీనివాస్(ఫైల్)

కడెం: మద్యం మానలేకపోతున్నానని మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కడెం మండలం అంబారిపేటలో జరిగింది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. అంబారిపేట్ గ్రామానికి చెందిన బొలిశెట్టి శ్రీనివాస్(34) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని తరచూ సూచిస్తున్నారు. శ్రీనివాస్ కూడా మద్యం మానేందుకు యత్నించాడు. కానీ, మానలేకపోయాడు. దీంతో మనస్తాపం చెంది ఈనెల 16న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో గురువారం ఉదయం మరణించాడు. శ్రీనివాస్ భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గిరిజన యువతికి న్యాయం చేయాలి


యువతికి మద్దతుగా పాల్గొన్న లీలాదేవి, మహిళలు

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రేచవేణి రాజశేఖర్ మైలారం గ్రామానికి చెందిన గిరిజన యువతి జంబి అంజలిని ప్రేమ పేరిట మోసం చేశాడని, అతడితో ఆమెకు పెళ్లి జరిపించి న్యాయం చేయాలని ఇంటర్నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షురాలు లీలాదేవి డిమాండ్ చేశారు. గురువారం గొల్లపల్లిలో ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించి న్యాయ పోరాటం చేస్తున్న యువతిని కలిసి మద్దతు తెలిపారు. రాజకీయ నాయకుల అండదండతోనే యువకుడు తప్పించుకుని తిరుగుతున్నాడని ఆరోపించారు. పోలీసులు, గిరిజన, మహిళా సంఘాలు యువతికి అండగా నిలిచి పెళ్లి జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

అత్తారింటికి వెళ్లొచ్చేసరికి ఇల్లు దోచేశారు


హావర్గలో బీరువా తాళం పగులగొట్టిన దొంగలు

లోకేశ్వరం: మండలంలోని హావర్గ గ్రామానికి చెందిన తుంగినోల్ల గంగాధర్ ఇంట్లో చోరీ జరిగింది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం.. దసరా పండుగ కోసం గంగాధర్ భార్య, పిల్లలు జగిత్యాల జిల్లా మల్లాపూర్ గ్రామంలోని పుట్టింటికి వెళ్లారు. వారిని తీసుకురావడానికి గంగాధర్ ఈనెల 15న సాయంత్రం ఇంటికి తాళం వేసి అత్తారింటికి వెళ్లాడు. అందరూ గురువారం హావర్గకు వచ్చారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో ఆందోళన చెందారు. లోపలికి వెళ్లి బీరువాలో చూడగా అందులో దాచి ఉంచిన రూ.1.30 లక్షల నగదు, 12 గ్రాముల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై దిగంబర్ సంఘట స్థలాన్ని పరిశీలించారు. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


గాయపడిన వెంకటేష్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సున్నంబట్టివాడ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానిక ఎస్సై ప్రవీణ్ తెలిపి వివరాల ప్రకారం.. స్థానిక వంద ఫీట్ల రోడ్డుకు చెందిన ఏటకారి వెంకటేష్(38) తన ద్విచక్రవాహనంపై రహదారిపైకి రాగా మంచిర్యాల వైపు నుంచి సీసీసీ వైపునకు వెళ్తున్న ఆటో అతివేగంగా ఢీకొట్టింది. దీంతో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. వెంకటేష్ భార్య సృజన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నీళ్ల బకెట్‌లో పడి బాలుడు మృతి


వివరాలు నమోదు చేస్తున్న ఏఎస్సై పోశెట్టి

వాంకిడి(ఆసిఫాబాద్): ఆడుకుంటూ ప్రమాదశాత్తు నీళ్ల బకెట్‌లో పడి పది నెలల బాలుడు మృతి చెందిన ఘటన గురువారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఏఎస్సై పోశెట్టి తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం తేజాపూర్ గ్రామానికి చెందిన చైదరి సునీత, గిర్మాజీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు చైదరి తన్వీర్ (పది నెలలు) ఉన్నారు. గురువారం గిర్మాజీ పొలం పనులకు వెళ్లగా.. అతడి భార్య ఇంట్లోనే పనులు చేసుకుంటోంది. ఈ క్రమంలో తన్వీర్ ఆడుకుంటూ బాత్రూమ్ వైపునకు వెళ్లాడు. అక్కడ నిండుగా ఉన్న నీళ్ల బకెట్‌లో ప్రమాదశాత్తు పడిపోయాడు. కొంతసేపటి తర్వాత గమనించిన బాలుడి తల్లి స్థానికుల సాయంతో ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా.. తన్వీర్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు


సర్టిఫికెట్లతో విద్యార్థులు

మంచిర్యాల అర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు గురువారం ముగిసాయి. ఆరు కళా విభాగాల్లో 175 మంది విద్యార్థులు, 75 మంది గైడ్ టీచర్లు పాల్గొన్నారు. 18మంది న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. గాత్రం, వాయిద్య సంగీతం, నృత్యం, డ్రామా, సంప్రదాయ కథలు, విజువల్ ఆర్ట్స్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో విజేతలు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గంటారని పోటీల సమన్వయ కర్త సత్యనారాయణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, మధుబాబు పాల్గొన్నారు.